

# నిజాయితీ ఖరీదు

**కె. యస్. వి. నరసింహం**

అతను తొడుక్కున్నవి నలిగిన బట్టలు. అతనిది వాడిన ముఖం. అతని శరీరం చాలా కృశించింది.

ఎందుకో అతని కళ్లలో ధైర్యం ఉబికివస్తూంది.

అతను కడుపు పట్టేటంతా తిన్నాడు. తిని కాఫీ తాగాడు. తాగి సర్వరు అందించిన బిల్లు అందుకున్నాడు. "థాంక్స్"మని తేన్చుతూ కౌంటరుకేసి నడిచాడు. మధ్య నిలువుటద్దంలో తన రూపం చూసుకున్నాడు. కౌంటర్లోకి బిల్లు తోసి జేబులో చెయ్యి పెట్టాడు. పెట్టిన చెయ్యి పెట్టినట్లే తిరిగి వచ్చింది. అతను ఉలిక్కిపడ్డాడు. మరో జేబులో...చొక్కా జేబులో... ఊహుఁ...ఎక్కడా లేదు.

"పర్సు . . . నా పర్సు..." అతను మెల్లిగా గొణుక్కున్నాడు. అతని ముఖం హఠాత్తుగా మారిపోయింది. కళ్లు కుంచించుకుపోయాయి. నల్లటి ముఖం రంగు మరింత నల్లబారింది.

"ఏమిటి? ఏమిటయిందీ?" కౌంటర్లో వ్యక్తి ప్రశ్న.

"పర్సు... నా పర్సు పోయింది." నూతిలోంచి జవాబు.

కౌంటరు వ్యక్తి బిల్లు చూశాడు. ఒకటీ తొంభై!

"రాస్కెల్! నీ మొహాని కొక పర్సు కూడానా? బిల్లు ఎగెయ్యాలని కదూ నీ ఎత్తు?" కౌంటరతను గుర్రుగా చూశాడు.

"లేదండీ! ఇవ్వాళే జీతాలిచ్చారు. నూట ముప్పై రూపాయలండీ . . . ఇప్పుడే తీసుకున్నాను."

"ఆ పప్పులేం ఉడకవు. ఎలాగోలాగు బిల్లు చెల్లించు. వాలకం చూస్తే తెలియడంలేదూ ఏ రకమో..."

"లేదు, బాబూ! నిజంగా... అలా వెళ్లి ఎక్కడయినా బదులు తెచ్చి చెల్లిస్తాను."

"వీల్లేదు!" కౌంటరతను అరిచాడు. "నీబోటి వాళ్ల నెందర్ని చూడలేదు నేను? ! . . . ఈ బిల్లు నీ దగ్గిరనుండి ఎలా రాబట్టుకోవాలో నాకు తెలుసు. లోపలికి వెళ్లి మధ్యాహ్నందాకా పిండి రుబ్బు!"

దీనుడు అతి దీనంగా ఉన్న ముఖం వేళ్లాడేసుకుని దిక్కులు చూస్తూ నిలబడ్డాడు.

"ఏమిటయింది?" బిల్లు చెల్లించవచ్చిన యువకు డొకడు అతనివే పాకమారు చూసి కౌంటరు వ్యక్తి నడిగాడు.

"దొంగవెధవలండీ! జేబులో దమ్మిడీ ఉండదుగానీ కనిపించిన హొటళ్లలోకి దూరి కడుపునిండా మెక్కడం."

యువకు డొకమారు దీనుడివేపు చూశాడు. "అతని బిల్లు నేను చెల్లిస్తాను" అన్నాడు.

కౌంటరు వ్యక్తి మొదట ఆశ్చర్యపడి తరవాత యువకు డందించిన డబ్బులు పుచ్చుకున్నాడు.

యువకుడు హొటలు మెట్లు దిగాడు. దీను డతణ్ణి వెంబడించాడు.

"మీ కెలా నా కృతజ్ఞతలు చెప్పుకోవాలో తెలియడం లేదు, బాబూ!"

యువకుడు చిన్నగా నవ్వాడు.

"నెల జీతం, బాబూ! నూట ముప్పై రూపాయలు. పాపిష్టి వాణ్ణి...ఆ డబ్బులు జేబులో పడేసరికి హొటలుకి వెళ్లాలనిపించింది. ఎవడో కొట్టేశాడు, బాబూ, పర్సుతోబాటు." దీనుడు కళ్ల నీళ్లు నింపుకున్నాడు.

యువకుడు కరిగిపోయాడు. 'నెలంతా గడప వలసిన నూట ముప్పై రూపాయలు పోయాయి. ఇక వీడి ఇంట్లో అందరూ ఉపవాసాలు చెయ్యాలేమో! ఈ దౌర్భాగ్యుడి కెందరు పిల్లలు? ఐదుగురో, ఆరుగురో!...ఇక ఇంటి ఖర్చులూ...'

దీనుడు దీనంగా చూశాడు.

యువకుడు జేబులోంచి — అయిదు రూపాయల కాగితం తీసి దీనుడి చేతుల్లో పెట్టాడు.

దీనుడు మరింత దీనంగా చూశాడు.

యువకుడు కదిలి పోయాడు. కనుమరుగయ్యాడు

చుట్టూ ఓ మాటు చూసి తృప్తిగా నవ్వుకున్నాడు దీనుడు. అతని ముఖం బాగా వెలుగుతూంది. అయిదు రూపాయల కాగితాన్ని జేబులో కుక్కుకున్నా డతను.

* * *

"బామ్మర్దీ! ఇవాళ సంపాద నెంత?"

"ఓహో! మంచి బోణీ ... అయిదు రూపాయలు!"

★